# నేను....అమ్మని

పద్దెనిమిదో క్వార్టరు ఆవరణలో పిల్లలు పోగయి ఆడుకుంటున్నారు. కొందరు ఇసకతో పిచ్చుకగూళ్ళు చేసుకుంటున్నారు. కొందరు తేలికగా కూచుని కబుర్లు చెప్పుకుంటూ ఆ గుళ్ళు చూస్తున్నారు. కొంచెం దూరంలో ఒక కుర్రవాడు పిల్లలికి తను చూసిన "కరాటే కమల" సినిమా వేసేస్తున్నాడు.

సుమతి కబుర్లు చెప్పుకుంటున్న పిల్లల దగ్గరకు వెళ్ళింది. కళ్ళతో ఏదో చెప్పి వాళ్ళను ఓ పక్కకి తీసుకు వెళ్ళింది.

"నేను టీచరును......మీరంతా నా పిల్లలు."

"ఛీ. టీచరాట నేనాడను" గబుక్కున అనేసింది ఐదేళ్ళ పద్మ.

"అవునే సుమతీ, అమ్మ ఆటయితే బావుంటుంది"

"అయితే నేనేమో నాన్నని" పద్మ అంది.

"నీ మొహం. నువ్ ఆడపిల్లవి నాన్నవెలా అవుతావ్!" బుజ్జిగాడు పద్మని వెక్కిరించాడు.

"పోన్లే నేనేమో అమ్మనిట, నువ్వేమో పక్కింటి వదినగారివి. బుజ్జీ నువ్మావద్ద ఉంటావా?

"పెద మామయ్యంటే నాకు చిరాకు. 'వెధవా పోయి చదువుకో' అని చెవిమెలేసేస్తూ ఉంటాడు. టెంకి జెల్లలు ఇచ్చేస్తాడు. ఎంచక్కా చిన్న మావయ్యయితే సినిమాకు తీసికెళ్ళి డుష్కుం డుష్కుం ఇంటర్వెల్‌లో అయిస్‌క్రీం ఇప్పిస్తాడు. నేను చిన్న మామయ్య ఉంటా."

ఎవరేది ఉండాలో మరికాసేపట్లో నిర్ణయమై పోయింది.

"వదినగారూ మొన్న మీరు కొనుక్కున్న చీర....." సుమతి ఆట ప్రారంభించేసింది.

సుమతి అన్న కాలుమీద తడిఇసక పోసుకుని దిబ్బడదబ్బడ కొడుతూ "చెల్లీ చెల్లీ" ఇంకా గట్టిగా పిలిచాడు.

"వెధవా, పనిలో ఉన్నప్పుడు కేకెయ్యొద్దని ఎన్ని సార్లు చెప్పాలి?"

కోపం ముఖం పెట్టింది సుమతి.

"...అబ్బ ఏమిటండీ, అ కిటీకీ దగ్గర కూచుని ఎం చేస్తున్నారూ?" అనసూయ కసురుకుంటూ వచ్చింది గదిలోకి. గోవర్ధనరావుగారు లేచినుంచున్నారు.

'ఇదా సంగతి? అక్కడ పాపాయి ఏడ్చి కక్కటిల్లి పోతుంటే మీరు చేస్తున్నదిదా?'

'అబ్బే లేదోయ్ పిల్లల ఆట చూడడంలేదు. ఇదిగో ఈ కెలడియోస్కొప్."

"బావుంది చిన్నపిల్లలూ, పాప ఏడుపు వినిపించడం లేదూ?"

'నాతో మాటాడుతూ కూచోకపోతే నువ్వే వెళ్ళరాదూ'. రావుగారికి విసుగు ఆగలేదు కాని ఒక్కక్షణంలో నిట్టూరుస్తూ వెనక గదిలోకి వెళ్ళారు. అనసూయ పిల్లలవంకే చూస్తోంది.

'పాపా! ఏయ్ పాపా'

కిటికీవంక తలలెత్తి చూశారు పిల్లలందరూ

'కొత్త ఆంటీ పిలుస్తోంది'. పద్మ సుమతికి చెప్పింది.

"నిన్నే!"

"కాదు, నిన్నే"

"నిన్నే. నే వెళ్ళను. నువ్వెళ్ళు"

'ఎందుకని?'

'అమ్మ వద్దంది.'

"నే వెళతా?' పద్మ ముందుకు పడిన జడను వెనక్కి విసురుకుంటూ చెంగు చెంగున మేడవంక పరిగెత్తింది. క్వార్టర్ కిందికి వచ్చి పద్మను కొత్తఆంటీ లోపలకు తీసుకెళ్ళడం బాబీ కళ్ళు రేకుల్లా చేసుకుని చూశాడు.

"అన్నాయ్ నువ్ మాత్రం" సుమతి గట్టిగా చెప్పింది.

"అబ్బ తెలుసులేవే. అమ్మ నీ గౌను కత్తిరించింది మధ్నాహ్నం. మిషన్‌కింద పేలికలున్నాయ్. పట్రా. జెండాచెయ్యాలి" సుమతి లేచి వెళ్ళింది.

"నేపాపనుచూసుకుంటా? నువ్వెళ్ళు"

"మీరే వెళ్ళుదురూ!

మూర్తిగారికి ఎందుకొచ్చానా అనిపించింది. తీరా వెళ్ళిపోతేవాళ్ళు బయటకు వచ్చి చూస్తే బాగుండదు.

చటుక్కున తలుపుతీసి గోవర్ధనరావు బయటకు వచ్చారు.

"నమస్కారమండీ!"

"ఓహ్ మీరా రండి, రండి" లోపలకు ఆహ్వానించారు మూర్తిగారిని.

"నా పేరు కృష్ణమూర్తి మీ పక్క సెక్షన్‌లో."

"అవునండీ, మిమ్మల్ని ఆఫీసులో చూశాను"

"హైదరాబాదు నుంచి వచ్చారు కదూ?"

"అవునండీ త్రీరూం క్వార్టర్స్ ఖాళీ లేవని ఈ రెండు గదుల ఫ్లాట్ ఇచ్చారు. పెద్దది ఖాళీ అయ్యేవరకూ-అనసూయా"

"వస్తున్నా. పాపగొడవ పెడుతోంది"

మరోక్షణంలో ఆవిడ ముందు గదిలోకి వచ్చింది.

"ఈయన మా పక్క సెక్షనులో పనిచేస్తున్నారు. మీకు పిల్లలా?" ఇలా అడుగుతున్న భర్తవంక చూసింది అనసూయ.

"ఓ బాబు, ఓ పాప. మీరు కొత్తగా వచ్చారు వచ్చి పరిచయం చేసుకుందామనుకుని వచ్చా! వీలు చూసుకుని మా యింటికి రండి యీ వరసలోనే పదహారవ నెంబరు...మీ పాప"

"ఆ మా పాప....మా పాప?" అనసూయ గొంతు వణికింది.

"అల్లరి బాగా చేస్తోందా!"

"అల్లరి చేస్తుంది మీకెందుకు? ఆఫీసు పనులు చేయించుకోడానికి ఇలా ఇళ్ళంట వేళ్లాడేవాళ్ళని చూస్తే నాకు ఒళ్ళుమంట అసహ్యం."

"ష, మీరు రండి. పాప అల్లరిచేస్తుండగా వచ్చానేమో వెళ్ళొస్తా!"

గోవర్ధనరావ్‌గారు లేచారు. మూర్తిగారు సాంతం లేవకుండానే.

"మళ్ళీ పాప గొడవే. మా పాప గొడవ చేస్తోందని మీ కెవరు చెప్పారు. అది ఎంత బుద్ధిమంతురాలో...కదండీ" గోముగా భర్త వంక చూసింది అనసూయ.

"సంతోషం. కొంతమంది అంతే నండీ! అసలు అల్లరి చెయ్యరు, మావాళ్ళు చూడండి వానికి అపోజిట్....మహా పెంకి ఘటాలు. ఇల్లు తీసి పందిరి వేసేస్తారు. గవర్నమెంటు క్వార్టర్స్ కాబట్టి సరిపోయింది" జోక్ వెయ్యాలనుకుని విశ్వప్రయత్నం చేసి అలా అన్నారు మూర్తిగారు.

"ఎప్పుడైనా వీలు చూసుకుని మీపాపను తీసుకురండి" బయటకు వస్తూ అనసూయ వంక తిరిగిమూర్తిగారు అన్నారు.

"మా పాపమీదెందుకండీ మీ కంత అపేక్ష...." గోవర్ధనరావ్‌గారు తన భార్య ఇంకా ఆ వాక్యాన్ని విస్తరింపజెయ్యకుండా బయటకి నడిచారు మూర్తిగారిని సాగనంపడానికి.

మూర్తిగారికి అనసూయ ప్రవర్తన వింతగా తోచింది. భార్యతో జరిగిన విషయం చెప్పాడు.

"అయ్యో! అదేమిటో ఆవిడకు ఓ రకం పిచ్చిలాంటిదని విన్నాను. పిల్లలకి నిన్న చెప్పాను వాళ్ళ ఇంటికి వెళ్ళవద్దని."

"పాపం, ముందు ఎందుకు వెళ్ళానా అనుకొన్నాను కాని ఆవిడనుచూస్తే జాలివేస్తోంది."

'చెల్లీ, వాళ్ళింటికి ఎందుకువెళ్లావే. అమ్మ కోప్పడు తుంది."

'నే వెళ్ళానని చెప్పకూ! వాళ్ళు మనల్ని ఇంటిలో పిల్లి రాకాసులంటే కోపం వచ్చి ధైర్యం చేశాను. అమ్మకి మాత్రం చెప్పకూ!"

"చెప్పను లేవే!"

"ఒట్టు!"

"ఒట్టు"

రాత్రి భోజనం దగ్గర సుమతిని మూర్తి కసిరాడు. "ఏమిటే అల్లా కతుకుతున్నావ్. ఆకలిలేదా?" సుమతి మాటాడలేదు.

"ఏరా జేబులో డబ్బులు పట్టుకుపోయి ఏవైనా కొనుక్కుతిన్నారా?"

"లేదు." బాబీ భయం భయంగా సమాధానం చెప్పాడు.

"నిజం చెప్పు"

"నిజంగానే తియ్యలేదు,"

"అది తీసిందా"

"అదికాదు నాన్నా మరేమో, మరేమో..."

"చెప్పు, నసుగుడెందుకు?"

"బాబీ మెట్లు చూడు ఎంతబాగున్నాయో!" సాయి బుజ్జి అంది. బాబీ కొత్త అంటీ ఇంటి కిటికీ

వంకే చూస్తున్నాడు.

"కొత్త ఆంటీ పద్మకి బిస్కెట్టుప్యాకెట్టంతా ఇచ్చేస్తుంది. వీడికేమో నోరూరిపోతుంది. ఆవిడపిలిస్తే వెళ్ళడు. నన్ను నన్ను పిలిస్తే వెళతా! బోల్డు చాక్లెట్లు ఆవిడ. మా పక్క పాప చెప్పింది."

"ఆఁ అందుకే దానికంత జ్వరం వచ్చింది". బాబీ చీదరించుకున్నాడు.

వాళ్ళింటిలో బొచ్చుకుక్క, కుందేలూ ఉన్నాయి, కుక్క కుఁయ్ కుఁయ్ మని అరుస్తుంది. చెవులపిల్లి బలే చెవులాడిస్తుంది. జగ్గు చెప్పుకు పోతున్నాడు.

"నువ్వెప్పుడు చూశావ్?" కిటికీవైపు నుంచి ముఖంతిప్పి జగ్గు వంక చూస్తూ అడిగాడు బాబీ.

"శశి చెప్పింది.....వాళ్ళ, పాప... ఆ పాట వినండి.

జగదీష్ కట్టిన ఇసక కట్టడం బాబీ చటుక్కున కాలితో తన్నేసాడు. జగ్గు బాబీ జుట్టు పీకాడు బాబీ జగ్గు బుగ్గ రక్కాడు.

పద్మ బిస్కట్ పాకెట్ పట్టుకుని అక్కడకు వచ్చింది.

"ఆ ఆంటీ ఎంత మంచిదో, మీకూ పెడతారండీ!" తలా ఒక ముక్కా పెడుతూ బాబీకి యివ్వబోయింది.

"నా కొద్దు" బాబీ ముఖం చీదరించుకున్నాడు.

"ఏం?"

"పోన్లే వాడి వంతు నా కిచ్చేయ్?" జగ్గు చెయ్యి జాచాడు.

"వాడెందుకు తినడు ?" ఓ అమ్మాయి అడిగింది.

"వాళ్ళమ్మ దెబ్బలాడుతుందట."

"పోన్లే మేమే తింటాం. ఒంటి పిల్లిరాకాశి."

"నేనేం కాదు" బాబీ బుగ్గలు కోపంతో మండాయి.

"అయితే కొత్త ఆంటీ యిచ్చిన,"

"అమ్మ దెబ్బలాడుతుంది."

"ఏం దెబ్బలాడదు" అప్పుడే ఎర్రపాప్లిన్ గుడ్డ పీలిక పట్టుకొచ్చిన సుమతి అంది. "నాకేం భయంలేదు. నేను ఆంటీ యింటికి వెళతా."

"చెల్లీ! బాబీ పిలుస్తుంటే వినిపించుకోకుండా తుఱ్ఱున పరిగెత్తింది సుమతి. బాబీ దిగులుగా ముఖం పెట్టాడు. పిల్లలు మళ్ళీ ఆటలో మునిగిపోయారు.

బెల్‌కొట్టి తలుపు తెరుచుకోడం కోసం నిరీక్షిస్తున్నాడు కృష్ణమూర్తిగారు. లోపల నుంచి మాటలువినపడుతున్నాయి.

"పాప చూడండి. ఎంచక్కా నవ్వుతోందో?"

"నా బంగారు తల్లి నవ్వితే వెన్నెల పూసినట్టుంటుంది."

"బావుంది అలా దిష్టిపెట్టెయ్యకండి"

"నువ్వు ముద్దులాడితే దిష్టితగలదా?"

మరోసారి బెల్లు కొట్టారు కృష్ణమూర్తిగారు.

"అ వచ్చే, చూడండి, ఎవరో."

"చెల్లేమో, ఏమో, ఆ కొత్త అంటీ ఇంటికి వెళ్ళి...."

"ఏం చేసింది"

"ఆవిడ ఇచ్చిన మైసూరుపాకు బిస్కెట్లు..."

"వెధవకానా ఎందుకు వెళ్లావ్? వెళ్ళినదానిని ఎగబడి అవెందుకుతిన్నావ్. ఎన్నితిన్నా మీకు కక్కుర్తి పోదు. ఎన్నాళ్ళనుంచో తిండి ఎరగనట్టు ఆవురావురని తినేస్తావ్ విసుక్కుంటూ ఛెళ్ళున ఓ దెబ్బ వేసింది సుమతికి వాళ్ళమ్మ.

పరాకుగా ఎటో చూస్తున్న సుమతి ఏడుపు లంకించుకుంది.

"ఎవరికళ్ళు ఎల్లాంటివో" అంటూ రెండు మిరపకాయలూ, ఇంత ఉప్పూ తెచ్చి దిగతుడిచింది ఆవిడ. "ఇక తిన్నది చాల్లేకాని పోయి పడుకో."

అర్ధరాత్రి వేళ సుమతి కలవరింతలు ప్రారంభించింది.

"ఆంటీ నేను తినను ఆంటీ. వాళ్ళు నన్ను ఒంటిపిల్లి రాకాసి అంటున్నారు మీ ఇంట్లో దయ్యం ఉందా ఆంటీ...దయ్యమంటే నాకు భయం."

.....హడలిపోయారు కృష్ణమూర్తి భార్యా.

డాక్టర్ వచ్చాడు. "జ్వరతీవ్రతవల్ల అలా మాటాడుతుంది. జడుసుకుని వుంటుంది. ఏం కంగారులేదు. మందిచ్చాను. రేపటికి తగ్గవచ్చు" ధైర్యం చెప్పి వెళ్ళిపోయాడు. మరుసటి రోజు కూడా జ్వరం తగ్గలేదు. ఆఫీసులో గోవర్ధనరావుకి విషయం వివరించి చెప్పారు మూర్తిగారు. "సార్? మా అమ్మాయికి విపరీతమయిన జ్వరం వచ్చేసింది. ఆంటీ అని కలవరిస్తోంది. ఆవిడ వస్తే దానికి జ్వరం తగ్గుతుందేమో? ప్లీజ్! మా అమ్మాయిని రక్షించండి" ఆవేశంగా అన్నారు మూర్తిగారు.

"కంగారు పడకండి మూర్తిగారూ నేనూ పాప తండ్రినే. మా పాప ఐదేళ్ళు బ్రతికి చనిపోయింది. చుట్టూ వాళ్ళు మమ్మల్ని అదోలా చూస్తున్నారనే భ్రమ అనసూయ మనసులో కలిగి పాపగురించి ఎవరేం మాటాడినాపిచ్చి దానిలా అవుతుంది. తల్లి హృదయాన్ని ఊరడించడానికి పాప ఇంకా బ్రతికి ఉన్నట్టే నేను నటిస్తూ వుంటాను. ఇద్దరం ఓ వింతలోకంలో ఉంటాం."

"ఆవిడను మా యింటికి తీసుకొస్తే."

"ప్రయత్నం చేస్తా. మీరు మాత్రం ఆమె ఎదుట ఏం మాట్లాడకండి."

సాయంకాలం గోవర్ధనరావు గారూ, అనసూయా కృష్ణమూర్తిగారింటికి వచ్చారు. గదిలో పాప తప్ప యింకెవరూ లేరు.

"పాపకి జ్వరంగా వుంది" రావ్‌గారు లోపలికి వస్తూనే అన్నారు.

"అం! ఏదీ?" వెంటనే మంచం దగ్గరకు వెళ్ళి సుమతి నుదుటను చెయ్యివేసి "అబ్బ, ఒళ్ళు మరిగిపోతుంది. తల్లీ, కళ్ళు తెరువమ్మా" మంచంమీద పాపపక్కనే కూచుంది.

"అమ్మా!"

"నా తల్లే, నాతల్లే" సుమతి జుట్టు నిమురుతూ గోముగా అంది అనసూయ "పాపా, ఎలా ఉందమ్మా?"

"దాహం దాహం!"

సుమతి గొంతు విని కృష్ణమూర్తి భార్య గ్లాసులో నీళ్ళు గోవర్ధనరావు గారికి అందించింది. అనసూయ నీళ్ళుపడుతూ ఉంటే సుమతి గడగడా తాగేసింది.

ఓ గంట కూచుని అనసూయా, భర్తా వెళ్ళిపోయారు. వాళ్ళు వెళ్ళగానే కృష్ణమూర్తిగారు సుమతి దగ్గరకు వచ్చి "చూశావా తల్లీ! ఆంటీ ఎంత మంచిదో నీకు జ్వరం తగ్గిన తరువాత ఆంటీకూడా నీతో పిచ్చుక గూళ్ళు ఆట ఆడుతుందట, నాతో చెప్పింది. నువ్వంటే ఆంటీకి ఎంతో ఇష్టం" అన్నాడు.

సుమతి నిద్రపోయింది.

"పిల్లలేకాదు, పెద్దవాళ్ళూ మనశ్శాంతి కోసం ఆటలు ఆడుకుంటారు. ఆవిడా ఆయనా రోజూ ఓ కాల్పనిక ప్రపంచంలో "నేను అమ్మని" "నేను నాన్నని" అని ఆడుకుంటూ ఉంటారు."

కృష్ణమూర్తిగారు నిట్టూరుస్తూ భార్యతో చెప్పారు.

ప్రభవ ఆగష్టు 1980